క్లుప్తంగా

ఘనంగా మరిడిమాంబ పండగ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి భక్తులు పసుపు కుంకుమలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. సారె, వస్త్రాలు, సుగంధ పుష్పాలు వంటివి సమర్పించారు. కాంట్రాక్టర్ ఎం.అప్పారావు అమ్మవారి ఘనంగా పూజలు నిర్వహించారు. నగరాల సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి దర్శినానికి వీరంతా సేవ గరడితో తరలివెళ్లారు. పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదంలో చిన్నారికి గాయాలు

మల్కాపురం: సర్వీసురోడ్డులో ఆగి ఉన్న ప్రైవేట్ కళాశాల బస్సును కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న చిన్నారికి స్వల్పగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.సింధియా న్యూకాలనీ నుంచి మల్కాపురం వైపు వెళ్తున్న నౌసేనాభాగ్ వద్ద సర్వీసురోడ్డుపై ఉన్న ప్రైవేట్ కళాశాల బస్సును వెనుక నుంచి ఢీ కొట్టింది. కారులో ఉన్న చిన్నారికి మాత్రం స్వల్పగాయాలయ్యాని పోలీసులు తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు



మాట్లాడుతున్న ఆచార్య పాండురంగ విఠల్‌మూర్తి

సీతంపేట: విశాఖ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో అడవి బాపిరాజు 128వ జయంతి సభ నిర్వహించారు. ఆచార్య కె.మలయవాసిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి మాట్లాడుతూ బాపిరాజు రచనలపై తన అభిరుచిని, అధ్యయనాన్ని వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ బాపిరాజు జీవిత విశేషాలను వివరిస్తూ, కథకుడిగా, నవలా రచయితగా, కళా దర్శకుడిగా బాపిరాజు బహుముఖ ప్రతిభను విశ్లేషించారు. జాతీయవాదిగా ఆయన స్థానం మహోన్నతమన్నారు.

ఘనంగా వీఎస్ కృష్ణ జయంతి


వీఎస్ కృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఏయూ క్యాంపస్: డాక్టర్ వీఎస్ కృష్ణ జయంతి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్థశాస్త్రం ప్రత్యేక అంశంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వీఎస్ కృష్ణ బీఏ పూర్తి చేశారన్నారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసి 1932లో తనకు ఇష్టమైన విద్యా రంగలో కృష్ణ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు.

ఏయూలో అర్థశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరిన ఆయన యూజీసీ చైర్మన్‌గా సైతం పని చేశారన్నారు. ఆయన స్మారకంగా గ్రంథాలయానికి డాక్టర్ వీఎస్ కృష్ణ పేరు పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- కేరాఫ్ పార్కులు
- గ్రీన్‌బెల్ట్‌ల ఆధునికీకరణ
- పార్కుల్లో పిల్లల కోసం ప్రత్యేక పరికరాలు
- వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధి
- మోడల్ లైటింగ్ ఏర్పాటుతో కళకళ


నడకదారిలో మోడల్ లైటింగ్


పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఊయలలు

విశాఖ విద్య: నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జీవీఎంసీ చర్యలు చేపట్టింది. పార్కుల సుందరీకరణ చేస్తోంది. మారుతున్న జీవన శైలికి అనుగుణంగా వ్యాయామానికి ప్రతీ ఒక్కరూ సమయం కేటాయిస్తున్న నేపథ్యంలో ఇందుకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. గ్రీన్ బెల్ట్‌లు అభివృద్ధి చేస్తున్నారు. పచ్చదనం పెంపొందిస్తున్నారు. దీంతో పార్కులు కళకళలాడుతూ ఆహ్లాదం పంచుతున్నాయి.


కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలు

శరవేగంగా పనులు

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 52వ వార్డులో పార్కులన్నీ ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. పార్కుల అభివృద్ధిని టీడీపీ ప్రభుత్వంలో పెద్దగా పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు జీవీఎంసీ నిధులు కేటాయిస్తోంది.

సకల సౌకర్యాలు

ఎన్ఏడీ కూడలి నుంచి మర్రిపాలెం వరకు జాతీయ రహదారికి కుడివైపు గ్రీన్ బెల్ట్‌ను సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. పలు కాలనీలకు చెందిన వారు ఉదయం, సాయంత్రం వేళల్లో కాసింత సేద తీరేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయటంతో పాటు రాత్రి 8 గంటల వరకు కూడా వీటిని వినియోగించుకునేలా మోడల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పార్కుల్లో పనులు పూర్తి కాగా మరికొన్ని చోట్ల శరవేగంగా చేస్తున్నారు.


ఆకట్టుకునేలా బొమ్మలు

పిల్లల కోసం ప్రత్యేక పరికరాలు

పుస్తకాలతో కుస్తీ పట్టే పిల్లలు సెలవు రోజుల్లో ఆటపాటలతో నిమగ్నమవుతారు. వీరు కోసం పార్కుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యాయామం చేసుకునేందుకు వీలుగా పరికరాలతో పాటు ఊయలు, ఇతర పరికరాలు ఏర్పాటు చేశారు. దీంతో పిల్లలు ఉల్లాసంగా పార్కుల్లో గడుపుతున్నారు.

బ్యూటిఫికేషన్‌కు ప్రాధాన్యం


హైవేకు ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌ల అభివృద్ధితో ఆ మార్గంలో ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. పార్కులను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మోడల్ లైటింగ్‌తో పాటు, తాగునీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. బ్యూటిఫికేషన్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

అందరికీ ఉపయోగం


ఎన్ఏడీ కూడలి రోజు రోజుకు అభివృద్ధి చెందుతుంది. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సూచనలకు అనుగుణంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎంతో కృషి చేస్తున్నారు. పార్కుల అభివృద్ధి చేయటం వల్ల అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– బీఎస్. కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

వైభవంగా పందిరి రాట మహోత్సవాలు


పందిరి రాట వేస్తున్న మాలినాయుడు దంపతులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజ చేసి పందిరి రాట వేశారు. కార్యక్రమంలో రాకింగ్ యూత్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

62వ వార్డులో..

జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో గణేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పందిరి రాటను పారిశ్రామికవేత్త మజ్జి మాలినాయుడు దంపతులు వేశారు. కార్యక్రమంలో గణేష్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరే రామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వం తీరుతో కార్మికుల జీవితాలు బలి


969వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో చేస్తున్న దుర్మార్గపు ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని, కార్మికుల జీవితాలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 969వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో హెచ్ఎంఎస్ యూనియన్ కాంట్రాక్ట్ వర్కర్స్, పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేద, యోగా, సంగీత సాధనతో ఆనందమయ జీవితం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వెండి నాణేలు అందిస్తున్న అచ్యుతరామయ్య, సత్యదేవ్


కార్యక్రమంలో పాల్గొన్న సంగీత జనకులం విద్యార్థులు

తాటిచెట్లపాలెం: ఆధునిక సమాజంలో వేద, యోగా, సంగీతపరమైన జీవన విధానం వల్ల సంతోషంగా జీవించవచ్చని జగద్గురు పీఠం డైరెక్టర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, కంచికామకోటి పీఠం తరఫున వెండి నాణేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇటీవల కంచికామకోటి పీఠం వారు నగరంలో నిర్వహించిన సంగీత గాన ఝరి కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రశంసాపత్రాలు, వెండి నాణేలతో సత్కరించినట్లు చెప్పారు. ముఖ్య అతిథి శంకర మఠం కార్యదర్శి టి.అచ్యుతరామయ్య మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆదేశంతో జరిపిన సంగీత ఉత్సవంలో నగరంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారన్నారు. ఈ క్రతువులు సంగీత జనకులం పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. సంస్థల సమన్వయంతో ఎన్నో సత్కార్యాలను చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం తరఫున అచ్యుతరామయ్యను డాక్టర్ సత్యదేవ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, సంగీత జనకులం అధ్యక్షులు ఇంద్రగంటి కాశీప్రసాద్, ఐ.రమణీప్రసాద్, సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, బాలభాను విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, డాక్టర్ బాలగణేష్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్ఐ ప్రమీల, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


అప్పారావు, నాగమణి దంపతులతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్

మల్కాపురం: కాంట్రాక్టర్, మల్కాపురం నగరాల సంఘం ప్రతినిధి ఎం.అప్పారావు, నాగమణి దంపతులను ఆదివారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మల్కాపురం వచ్చిన ఆయన ముందుగా అప్పారావు ఇంటికి వెళ్లి దంపతులతో కాసేపు ముచ్చటించారు. వారి కుటుంబ సభ్యులను పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో 61వ వార్డు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా అప్పారావు భార్య నాగమణి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పార్టీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు(కేబుల్ వాసు), మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్, పార్టీ 63వ వార్డు ఇన్‌చార్జ్ పిలక రామ్మోహన్‌రెడ్డి(రాము), పీలా అనంత్‌కుమార్, బూసి అప్పలరెడ్డి, శంకర్, దాసరి రవి, వరహాలు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో తాగునీటి సౌకర్యం


వాకర్స్‌కు తాగునీరు అందిస్తున్న పత్నీరావు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని వాకర్స్ పార్కులో వాకింగ్, సైకిలింగ్‌కు వచ్చిన వారికి ఆదివారం వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు శరగడం పత్నీరావు మినరల్ వాటర్ అందజేశారు. ఈ పార్కులో తాగునీటి సౌకర్యం లేదు. ఈ సమస్యను వాకర్స్ ద్వారా తెలుసుకున్న ఆయన తన సొంత నిధులతో పార్కులో నిత్యం మినిరల్ వాటర్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పత్నీరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌లను స్ఫూర్తిగా తీసుకుని వార్డులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని చెప్పారు. ఇందులో భాగంగా వాకర్స్‌కు తాగునీటి సౌకర్యం కల్పించానని, వచ్చే వారం పేద చిన్నారులకు పౌష్టికాహారం, పుస్తకాలు పంపిణీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కాలనీ సమస్యలపై వినతి


కార్పొరేటర్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్‌కాలనీ వాసులు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావుకు వినతి పత్రం సమర్పించారు. మంచినీటికి ఇబ్బంది పడుతున్నామని, డ్రైనేజీ సమస్య కూడా. ఉందని వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వార్డులో అధిక శాతం కొండవాలు ప్రాంతాలు కావడంతో టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, దీంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో ఆలస్యమవుతుందన్నారు. విషయాన్ని పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకవెళ్లామని, త్వరలోనే సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు.

వెళ్లిరా.. వినాయకా..


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


గవరవీధిలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: గవర వీధి గౌరీ యూత్ ఆధ్వర్యంలో వినాయ విగ్రహం అనుపు మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. భారీ విగ్రహాన్ని నిమజ్జనం చేసే ముందు అశ్వవాహనంపై ఊరేగించారు. గరిడి సాము, కేరళ వాయిద్యాలు, తీన్‌మార్, విచిత్రవేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బాణ సంచాతో సందడి చేశారు. గవరవీధి గౌరీ సేవా సంఘం సభ్యులు, గౌరీ యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందికి అభినందన


ఆస్ట్రేలియా సందర్శనను పూర్తి చేసుకున్న ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బంది


ఐఎన్ఎస్ వాగిర్ సిబ్బందిని అభినందిస్తున్న ఈఎన్‌సీ సబ్ మెరైన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సింధియా: ఆస్ట్రేలియాలోని ఫ్రీమాంటిల్ సందర్శనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఆదివారం తిరిగొచ్చిన ఐఎస్ఎస్ వాగిర్ సిబ్బందిని తూర్పు నావికా దళ సబ్‌మెరైన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అభినందించారు. రాయల్ ఆస్ట్రేలియా నేవీతో ద్వైపాక్షిక వ్యాయామాల్లో వాగిర్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కెప్టెన్ ద్వారా రెండు దేశాల ద్వైపాక్షిక వ్యాయామాలకు సంబంధించిన మరిన్ని విషయాలను రాజేష్ పెంధార్కర్ అడిగి తెలుసుకున్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం: ప్రజలంతా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 87వ వార్డు పరిధి మీ సేవ వద్ద గల ఫిష్‌మార్కెట్‌లో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరు ప్లాస్టిక్ సంచులకు బదులు స్టీల్ బాక్స్‌లు, నార సంచులు ఉపయోగించాలని, ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని కోరారు. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చాలని, ఇంకుడు గంతలను తవ్వి భూగర్భ జలాలను సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పరమానందం, పి.ఎస్.ఎస్.రెడ్డి, కామరాజు, వసంతరెడ్డి, మూర్తి, చంద్రకిరణ్, శ్రీరాములు, దిల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.